
సాక్షి
అనంతపురం
మంగళవారం । 11 । జూన్ । 2024



చీనీ టన్ను రూ.38 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.38 వేలు పలికాయి.



భూముల్లో సేంద్రియ లోపం

జిల్లాలో ఉన్న భూముల్లో కీలకమైన సేంద్రియ కర్బనం చాలా తక్కువగా ఉన్నట్లు పరిశోధనల్లో వెల్లడైంది.

8లో

గరిష్టం/కనిష్టం
33.4°/22.1°

జిల్లా అంతటా సోమవారం ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టాయి. ఆకాశం మేఘావృతమై పలు మండలాల్లో వర్షం కురిసింది. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 12 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

రైళ్ల సగటు వేగాన్ని పెంచేలా చర్యలు తీసుకోండి



మాట్లాడుతున్న జీఎం అరుణ్‌కుమార్‌జైన్

గుంతకల్లు: ఎక్స్‌ప్రెస్, మెయిల్ రైళ్ల సమయ పాలనను మెరుగుపరచాలని, రైళ్ల సగటు వేగాన్ని పెంచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ ఆదేశించారు. జోనల్‌లోని డీఆర్ ఎంలతో సోమవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. రైలు రాకపోకలు, భద్రతపై సమీక్షించారు. రైలు సురక్షితంగా నడిపేందుకు భద్రతకు సంబంధించిన విధివిధానాలను కచ్చితంగా పాటించాలన్నారు. తరచూ భద్రతపై లోకో పైలట్లు, స్టేషన్ మాస్టర్లు, పర్మినెంట్ వే మెయింటెనెన్స్, రన్నింగ్ సిబ్బందికి అవగాహన కల్పిస్తుండాలన్నారు. ఇంజినీరింగ్, మెకానికల్, సిగ్నలింగ్ విభాగాలకు చెందిన పరికరాలు, తదితర వస్తువుల లభ్యతపై ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించాలన్నారు. సిబ్బందికి విశ్రాంతి వేళలు కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. సమావేశంలో గుంతకల్లు నుంచి డీఆర్ఎం వినీత్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంబీఏ, ఎంసీఏ ఫలితాల విడుదల

అనంతపురం: జేఎన్‌టీయూ (ఏ)లో పరిధిలో మే నెలలో నిర్వహించిన ఎంసీఏ, ఎంబీఏ సెమిస్టర్ల ఫలితాలు విడుదలయ్యాయి. నాలుగో సెమిస్టర్ (ఆర్–21) రెగ్యులర్, సప్లిమెంటరీ, ఎంసీఏ ఐదో సెమిస్టర్ (ఆర్–17), నాలుగో సెమిస్టర్, మూడో సెమిస్టర్ (ఆర్–21), (ఆర్–17) సప్లిమెంటరీ ఫలితాలను విడుదల చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ ఈ. కేశవ రెడ్డి , కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ బి. చంద్ర మోహన్ రెడ్డి తెలిపారు. ఫలితాల కోసం జేఎన్ టీయూ(ఏ) వెబ్‌సైట్‌లో చూడాలని కోరారు.

ఉద్యానశాఖ ఇన్‌చార్జ్ డీడీగా ఫిరోజ్‌ఖాన్

అనంతపురం అగ్రికల్చర్: జిల్లా ఉద్యానశాఖ ఇన్‌చార్జ్ ఉప సంచాలకులు (డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్–డీడీహెచ్)గా జి.ఫిరోజ్‌ఖాన్ సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ పనిచేస్తున్న డీడీహెచ్ బీఎంవీ నరసింహారావు 40 రోజులు సెలవు పెట్టారు. దీంతో ఆయన స్థానంలో ఏపీఎంఐపీ ఏపీడీ ఫిరోజ్‌ఖాన్‌కు అదనంగా ఉద్యానశాఖ బాధ్యతలు అప్పజెప్పారు. ఈ క్రమంలో స్థానిక ఉద్యానశాఖ కార్యాలయంలో ఆయన బాధ్యతలు తీసుకున్నారు. కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ బాషా, హెచ్‌ఓలు పల్లవి, రత్నకుమార్ తదితరులు ఫిరోజ్‌ఖాన్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు



ఎరువుల గోదామును పరిశీలిస్తున్న ఏడీఏ

యాడికి: అనుమతి పొందిన కంపెనీల ఎరువులు, పురుగు మందులు, విత్తనాల విక్రయాలు సాగిస్తూ, ప్రతి అమ్మకానికి తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని ఎరువుల దుకాణాల నిర్వాహకులకు గుత్తి ఏడీఏ వెంకట్రాముడు సూచించారు. సోమవారం యాడికిలోని వెంకట్ ఫర్టిలైజర్ దుకాణం, గోదామును ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేని 4 రకాల పత్తి విత్తనాల అమ్మకాన్ని నిలిపి వేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే ఆధారాలు లేని రూ.5లక్షల విలువ గల ఎరువుల విక్రయాలను నిలుపుదల చేశారు. ఎరువుల దుకాణ యజమానులు లైసెన్సులను రెన్యూవల్ చేసుకోవాలని, మార్గదర్శకాలను డీలర్లు పాటించకపోతే వారి లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు.

- వైద్య వృత్తికి డిమాండ్
- జిల్లా నుంచి ఏటా 'నీట్' రాసే వారు పెరుగుతున్న వైనం
- సీటు సంపాదించడం కష్టమైనా వెనక్కు తగ్గని యువత
- ఎంబీబీఎస్‌తోనే కాదు.. పీజీ వైద్యవిద్యకూ ముందుకు

మార్కెట్‌లో నేడు వైద్యులకు ఉన్న డిమాండ్ అంతా ఇంతా కాదు. ఒకసారి బాగా వైద్యం చేస్తారని పేరు వస్తే ఇక కాసుల వర్షం కురిసినట్లే. అందుకే అలాంటి డాక్టర్ వృత్తిలో స్థిరపడాలని జిల్లా యువత ఉవ్విళ్లూరుతున్నారు. జాతీయ స్థాయిలో లక్షల సంఖ్యలో పోటీ పడే 'నీట్'కు దరఖాస్తు చేస్తున్నారు. దేశంలో ఏ ప్రాంతంలో సీటు వచ్చినా, అక్కడికే వెళ్లి మరీ వైద్య విద్య అభ్యసిస్తున్నారు.



అనంతపురంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల

డాక్టర్ కల.. పెరుగుతోందలా..

సాక్షిప్రతినిధి, అనంతపురం: రాష్ట్ర స్థాయిలో నిర్వహించే మెడిసిన్ ప్రవేశ పరీక్షలను తొలగించి కొన్నేళ్లుగా జాతీయ స్థాయిలో నీట్ పరీక్ష నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఏటా నీట్ రాసే వారి సంఖ్య పెరుగుతోందే కానీ తగ్గడం లేదు. ఏటా ఉమ్మడి జిల్లా నుంచి 7 వేల మంది వరకూ 'నీట్' రాస్తున్నారు. ఏటా 300 మందికి పైగానే ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలల్లో చేరుతున్నారు. అనంతపురం వైద్య కళాశాలలో 150 సీట్లు మాత్రమే ఉన్నా, పోటీ పడి మరీ సీటు సంపాదించుకుంటున్నారు.

సంప్రదాయ పద్ధతులకు స్వస్తి

మెడిసిన్ సీటు సంపాదించడం సవాలుతో కూడుకున్నది, జీవితంలో స్థిరపడడం చాలా కష్టం తదితర సందేహాలెన్నో గతంలో తల్లిదండ్రులకు ఉండేవి. కానీ, మారిన పరిస్థితులకు అనుగుణంగా వారు కూడా మారారు. సంప్రదాయ ఆలోచనలకు స్వస్తి చెబుతూ తమ పిల్లలను మెడిసిన్ విద్య వైపు ప్రోత్సహిస్తున్నారు. ఈ క్రమంలోనే పిల్లలు తమ తల్లిదండ్రుల అండదండలతో ఎలాగైనా సీటు సాధించి, ఇతర రాష్ట్రాల్లో అయినా ఎంబీబీఎస్ పూర్తి చేస్తున్నారు. మన రాష్ట్రంలో సీటు దొరకని ఎంతోమంది వైద్య విద్యార్థులు మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు వెళ్లి వైద్యవిద్య చదువుతున్నారు. ఒక ఏడాది సీటు రాకపోయినా రెండో ఏడాదైనా పోరాడి సీటు తెచ్చుకుంటుండడం గమనార్హం. తమ సొంతూరిలో డాక్టరుగా స్థిరపడాలనే లక్ష్యంతో కొందరు అడుగులేస్తుంటే, మరికొంత మంది విదేశాలకు వెళ్లి బాగా సంపాదించవచ్చనే ఆశతో మెడిసిన్ పూర్తి చేస్తున్నారు.

పీజీ వైపూ పరుగులు..

ఎంబీబీఎస్ కోర్సుతో సరిపెట్టుకునే వారు చాలా తక్కువగా ఉంటున్నారు. పీజీ చదివితేనే మార్కెట్‌లో నిలదొక్కుకుంటామనుకుని భావించి కళాశాలల్లో సీట్లు దక్కించుకునేందుకు సివిల్స్ స్థాయిలో పోటీపడుతున్నారు. జాతీయ స్థాయిలో సీట్లు పరిమితంగానే ఉండి పోటీ తీవ్రంగా ఉంటున్నా, అహర్నిశలు కష్టపడుతున్నారు. ప్రైవేటులో సీట్లు రూ.కోట్లు పలుకుతున్న నేపథ్యంలో ప్రభుత్వ కళాశాలల్లో సాధారణ బ్రాంచిలో సీటు దొరికినా చేరిపోతున్నారు. ఉదాహరణకు గుంతకల్లు పట్టణానికి చెందిన అభినవ్ తనకు ఆర్థోపెడిక్స్ చదవాలని కోరిక ఉన్నా, పరీక్షలో వచ్చిన మార్కుల కారణంగా అనస్తీషియా రావడంతో హైదరాబాద్‌లోని ఓ కళాశాలలో చేరినట్లు తెలిసింది. అయితే, ఎక్కువ మంది ఎంబీబీఎస్ పూర్తి చేశాక సర్జరీ లాంటి ప్రాముఖ్యత ఉన్న విభాగాల వైపు మొగ్గు చూపుతున్నారని సమాచారం.

ఏటా జిల్లాలో నీట్ రాసే వారు	6 వేల నుంచి 7 వేలు
సీట్లు పొందుతున్న వారు	300 మందికి పైనే
సగటున ప్రభుత్వ సీట్లు పొందుతున్న వారి సంఖ్య	60 నుంచి 70
ప్రస్తుతం జిల్లాలో ఎంబీబీఎస్ వైద్యులు	2 వేల మంది పైనే
జిల్లాలో పీజీ వైద్య విద్య పూర్తి చేసిన వారు	400 పైనే
ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉన్న వైద్యులు	450 మంది పైనే

రెండో ప్రయత్నంలో సీటు కొట్టా



విద్యార్థి దశలోనే డాక్టర్ కావాలనే లక్ష్యం ఏర్పడింది. అదే విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పా. వారి నుంచి సానుకూల స్పందన వచ్చింది. నీట్ మొదటిసారి రాసినప్పుడు త్రుటిలో అవకాశం చేజారింది. నిరాశ చెందక రెండో ప్రయత్నంలో సీటు సాధించా. రాష్ట్రంలోని పేరొందిన కళాశాలల్లో అనంతపురం వైద్య కళాశాల ఒకటి. ఇక్కడ అధ్యాపకులు, కళాశాల వాతావరణం చాలా బాగుంది. ఎంబీబీఎస్ అయ్యాక కచ్చితంగా స్పెషలైజేషన్ చేస్తా.

– గ్రీష్మ, ఎంబీబీఎస్ ఫస్ట్ ఇయర్, హైదరాబాద్

మరింత పట్టుకే పీజీ



ఎంబీబీఎస్ పూర్తి చేసిన తర్వాత ప్రభుత్వ సర్వజనాస్పత్రి, ఆత్మకూరు, బుక్కరాయసముద్రంలో ప్రజలకు సేవలందించా. తల్లిదండ్రులు రామానాయక్, లక్ష్మి ప్రోత్సాహం, పీజీ చేయాలన్న కోరికతో రేడియాలజీ విభాగాన్ని ఎంచుకున్నా. రోగి వ్యాధి నిర్ధారణలో రేడియాలజీ ఎంతో కీలకం. ఆయా అంశాలపై పట్టు సాధించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలందిస్తా. అనంతపురం వైద్య కళాశాలలో సానుకూల వాతావరణం ఉంది. ఇక్కడ విద్యనభ్యసిస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది.

– డాక్టర్ రజిత, అనంతపురం

పోటీతత్వంతోనే ఉన్నతస్థాయికి..



వైద్య వృత్తి ఎంతో గౌరవప్రదమైనది. విద్యార్థి దశ నుంచి మెడిసిన్ వరకు చదవడానికి పదేళ్లు పడుతుంది. తల్లిదండ్రుల ఆకాంక్ష, ప్రజలకు మంచి చేయాలన్న దృక్పథంతో ఎంతో మంది విద్యార్థులు పోటీ పడుతూ వైద్య వృత్తిలో చేరుతున్నారు. ఇటీవల కాలంలో పోటీ పెరిగినా.. నీట్ రాసే వారి సంఖ్య ఏమాత్రం తగ్గడం లేదు. ఆ పోటీతత్వమే వారిని ఉన్నతస్థానానికి తీసుకెళ్తుంది.

– డాక్టర్ మాణిక్యరావు, ప్రిన్సిపాల్, అనంతపురం వైద్య కళాశాల

పొదుపు డబ్బు స్వాహా

- యానిమేటర్ భర్త నిర్వాకం

కళ్యాణదుర్గం: మహిళలు తమ పొదుపు సంఘాల్లో దాచుకున్న డబ్బుల్ని ఓ యానిమేటర్ భర్త స్వాహా చేశాడు. సభ్యులకు అనుమానమొచ్చి నిలదీయడంతో బాగోతం వెలుగులోకి వచ్చింది. వివరాలు.. కళ్యాణదుర్గం మండలం మల్లికార్జునపల్లిలో సుమారు 30 వరకు గ్రామైఖ్య సంఘాలున్నాయి. యానిమేటర్‌గా లక్ష్మీ నరసమ్మను ఎంపిక చేసినా, ఆమెకు బదులు భర్త ఎర్రిస్వామి విధులు నిర్వహిస్తున్నాడు. గ్రామ మహిళా సంఘాల సభ్యుల లావాదేవీలన్నీ కళ్యాణదుర్గంలోని సిండికేట్ బ్యాంక్ (కెనరా బ్యాంక్)లో జరుపుతున్నారు. ఒక్కో సంఘానికి వైఎస్సార్ క్రాంతి పథకం ద్వారా రూ.10 లక్షల నుంచి రూ.12 లక్షల వరకూ రుణాలు తీసుకున్నారు. రుణాన్ని ప్రతి నెలా కంతుల రూపంలో చెల్లిస్తూనే, వ్యక్తిగతంగా కొంత మొత్తం పొదుపు చేసుకుంటున్నారు. ఈ క్రమంలోనే తమ పొదుపు ఖాతాల నుంచి ఎవరో డబ్బు డ్రా చేస్తున్నట్లు గుర్తించిన మహిళలు.. సోమవారం మూకుమ్మడిగా సిండికేట్ బ్యాంక్ అధికారులను ఆశ్రయించగా, బాగోతం బయటపడింది. అధికారులు సదరు యానిమేటర్ భర్తను విచారించగా, డబ్బు కొట్టేసినట్లు ఒప్పుకున్నాడు. సంఘాల సభ్యులు పొదుపు వేసేందుకు, రుణం తీసుకునేందుకు వచ్చినప్పుడు నగదు విత్ డ్రా ఫారాలపై లీడర్లతో అదనంగా సంతకాలు చేయించుకుని, ప్రతి సంఘం నుంచి రూ. లక్ష నుంచి రూ.3 లక్షల చొప్పున దాదాపు రూ. 30 లక్షలు డ్రా చేసి, వ్యక్తిగత అవసరాలకు వాడుకున్నట్లు తెలిపాడు. దీంతో బాధితులు అతడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే డబ్బు తిరిగివ్వకపోతే పోలీసు స్టేషన్‌లో కేసు పెడతామంటూ హెచ్చరించారు. కాగా, జరిగిన బాగోతంలో వెలుగు అధికారులు, బ్యాంక్ అధికారుల తప్పిదం ఉండటంతో రికవరీ చేయించేందుకు నానా తిప్పలు పడుతున్నారు.

రాత్రి గస్తీ పెంచండి

- ఎస్పీ గౌతమి శాలి

కూడేరు: రాత్రి పూట గస్తీని పెంచి చోరీలను అరికట్టాలని ఎస్పీ గౌతమి శాలి ఆదేశించారు. కూడేరు ఎస్సీ కాలనీ వద్ద ఉన్న ఎస్‌బీఐ ఏటీఎం సెంటర్లో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు రూ.18,41,300 ఎత్తుకెళ్లిన విషయం విదితమే. ఈ క్రమంలో సోమవారం రాత్రి ఆమె చోరీ జరిగిన ఏటీఎం సెంటర్‌ను తనిఖీ చేశారు. సీసీ కెమెరా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధాన రహదారి పక్కన ప్రైవేటు వ్యక్తులు ఏర్పాటు చేసుకున్న సీసీ కెమెరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సీఐ శివరాముడుని ఆదేశించారు. దేవాలయాలు, ఏటీఎం సెంటర్లపై నిఘా పెంచాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

ప్రజలకు సత్వర సేవలందాలి



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్, చిత్రంలో జెడ్పీ సీఈఓ నిదియాదేవి



హాజరైన వివిధ శాఖల అధికారులు

- అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలి
- కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశం

అనంతపురం అర్బన్: 'ప్రజలకు మెరుగైన సేవలు సత్వరం అందాలి. ఇదే లక్ష్యంగా అందరూ చిత్తశుద్ధితో పనిచేయాలి. ప్రభుత్వ ఆదేశాలు, ఆకాంక్షలకు అనుగుణంగా విధులు నిర్వర్తించాలి' అని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ అన్నారు. వరద నిర్వహణ, మొక్కల పెంపకం, కేంద్ర బృందం పర్యటన తదితర అంశాలపై కలెక్టర్ సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో జిల్లా అధికారులు, ఆర్‌డీఓలు, ఇతర అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరద నిర్వహణకు సంబంధించి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఎలాంటి చర్యలు తీసుకోవాలనే విషయంపై ఈనెల 13లోగా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. వర్షాకాలంలో విరివిగా మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టాలన్నారు. నాటిన మొక్కలను ప్రజలు, విద్యార్థులు, అధికారులు దత్తత తీసుకుని సంరక్షించాలన్నారు. హెచ్ఎల్‌సీ పరిధిలోని ఉప కాలువల్లో ఉపాధి పనులు చేపట్టేందుకు ప్రతిపాదలను సిద్ధం చేయాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణాలు, గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని ఆదేశించారు. మున్సిపాలిటీల పరిధిలోని కాలువల్లో చెత్త, ప్లాస్టిక్ తొలగింపు పనులు చేపట్టాలన్నారు. ప్లాస్టిక్ నిషేధం అమలుకు చర్యలు తీసుకోవాలని, ఇందుకు ఒక బృందాన్ని సిద్ధం చేయాలన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లోనూ మహిళా ఉద్యోగుల నుంచి ఫిర్యాదులు స్వీకరించేందుకు కమిటీలను ఏర్పాటు చేయాలని చెప్పారు. జిల్లాలో ఈనెల 17 నుంచి కేంద్ర బృందం పర్యటన ఉంటుందన్నారు. వ్యవసాయ, పశు సంవర్ధక, ఆర్‌డబ్ల్యూఎస్, ప్రజారోగ్య, భూగర్భజల, నీటిపారుదల, డ్వామా తదితర శాఖలు నివేదికలతో సిద్ధంగా ఉండాలని చెప్పారు. బృంద సభ్యులు విడపనకల్లు, కణేకల్లు, తాడిపత్రి, పుట్లూరు, యల్లనూరు తదితర మండలాల్లో పర్యటించి క్షేత్రస్థాయి అధికారులతో మాట్లాడతారన్నారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో శాంతియుతంగా నిర్వహించేందుకు సహకరించిన జిల్లా యంత్రాంగానికి కృతజ్ఞతలు తెలియజేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకార కార్యక్రమం ఈనెల 12న ఉంటుందని, ఈ క్రమంలో కార్యక్రమాన్ని వీక్షించేందుకు జిల్లాలోని ముఖ్య ప్రాంతాలు, కల్యాణమండపాల్లో లైవ్ స్ట్రీమింగ్‌కు చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యమైన భవనాల్లో లైటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియాదేవి, నగర పాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్, అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఆర్‌డీఓలు పాల్గొన్నారు.

తూకాల్లో మోసాలకు కళ్లెం వేయండి

తూకాల్లో మోసాలకు అడ్డుకట్ట వేయాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ ఆదేశించారు. వస్తువులను ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు విక్రయిస్తే చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో తూనికలు, కొలతల శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్టాండు, రైల్వేస్టేషన్ ప్రాంతాల్లో వస్తువులకు ఎమ్మార్పీకి మించి వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఆకస్మిక తనిఖీలు నిర్వహించి ఇలాంటి వాటిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధాన మార్కెట్‌లు, కూరగాయల మార్కెట్, పరిసరాల్లోనూ ఇలాంటి మోసాలు అధికంగా జరుగుతుంటాయని, దాడులు నిర్వహించి అడ్డుకట్ట వేయాలన్నారు. అధిక ధరకు విక్రయాలు, తూకాల్లో మోసాలకు పాల్పడితే ఎలాంటి చర్యలు తీసుకుంటారనే దానిపై వ్యాపారులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, తూనికలు కొలతల శాఖ అసిస్టెంట్ కంట్రోలర్ పి.సుధాకర్, ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ గౌస్ పాల్గొన్నారు.

గుంతకల్లు డీఎస్పీ, సీఐ ఓవరాక్షన్



ఎమ్మెల్సీ శివరామిరెడ్డి వాహనాన్ని అడ్డుకుంటున్న పోలీసులు



ఎమ్మెల్సీతో మాట్లాడుతున్న గుంతకల్లు డీఎస్పీ శివభాస్కర్‌రెడ్డి


- ప్రెస్‌మీట్‌కు వెళ్లకుండా ఎమ్మెల్సీ శివరామిరెడ్డిని అడ్డుకున్న వైనం
- ప్రజాస్వామ్య హక్కును కాలరాసేలా వ్యవహరించిన పోలీసులు

వజ్రకరూరు: గుంతకల్లు డీఎస్పీ శివభాస్కర్‌రెడ్డి, వన్‌టౌన్ సీఐ రామసుబ్బయ్య ఓవరాక్షన్ చేశారు. ప్రెస్‌మీట్‌కు వెళ్లకుండా ఎమ్మెల్సీ శివరామిరెడ్డిని అడ్డుకుని ప్రజాస్వామ్య హక్కును కాలరాసేలా వ్యవహరించారు. గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సమీప బంధువు గుమ్మనూరు నారాయణ రెండు రోజుల క్రితం మాజీ ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులను రెచ్చగొట్టారు. దీన్ని తీవ్రంగా ఖండిస్తూ ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి సోమవారం ప్రెస్‌మీట్ పెట్టడానికి తన అనుచరులతో కొనకొండ్ల నుంచి గుత్తి పట్టణానికి బయలు దేరారు. ఈ క్రమంలోనే గుంతకల్లు డీఎస్పీ శివభాస్కర్ రెడ్డి, వన్‌టౌన్ సీఐ రామసుబ్బయ్య,వజ్రకరూరు ఎస్ఐ నరేష్‌తో పాటు పెద్ద సంఖ్యలో పోలీసులు అక్కడకు చేరుకుని ఎమ్మెల్సీని అడ్డుకున్నారు. ఈ విషయం తెలియడంతో గుంతకల్లు, ఉరవకొండ నియోజకవర్గాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో అక్కడకు చేరుకున్నారు. పోలీసుల తీరును నిరసించారు. ఈ క్రమంలోనే జిల్లా ఎస్పీ గౌతమిశాలి ఫోన్‌లో ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డితో మాట్లాడారు. మళ్లీ ఇలాంటి ఘటనలు జరగకుండా చూస్తామని చెప్పడంతో ఎమ్మెల్సీ శాంతించారు.

ప్రజాస్వామ్యబద్ధంగానే ఎదుర్కొంటాం

అనంతరం అక్కడే ఎమ్మెల్సీ విలేకరులతో మాట్లాడారు. టీడీపీ నాయకుల ఆగడాలను ప్రజాస్వామ్యబద్ధంగానే ఎదుర్కొంటామన్నారు. గుమ్మనూరు నారాయణ నోరు అదుపులో పెట్టుకోవాలన్నారు. రెచ్చగొట్టేలా మాట్లాడటం సరికాదన్నారు. జిల్లాలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై జరుగుతున్న దాడులను ఖండిస్తున్నామన్నారు. పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించి దాడులను అరికట్టాలని కోరారు. ప్రజాస్వామ్యంలో జయాపజయాలు సహజమని, గెలుపొందిన వారు ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు అభివృద్ధికి పాటుపడాలని హితవు పలికారు. రాజకీయాలను కేవలం రాజకీయంగా మాత్రమే చూడాలని, ద్వేషాలకు తావివ్వకూడదని సూచించారు.

టీబీ డ్యాం కళకళ



బొమ్మనహాళ్: భారీగా వచ్చి చేరుతున్న వరద నీటితో కర్ణాటకలోని హొస్పేట్ వద్ద ఉన్న తుంగభద్ర జలాశయం కళకళలాడుతోంది. జిల్లా ప్రజలకు హెచ్చెల్సీ (ఎగువ) కాలువ ద్వారా తాగు, సాగు నీరందించే ఈ జలాశయానికి కొన్ని రోజులుగా ఇన్‌ఫ్లో నిలకడగా కొనసాగుతోంది. ఎగువ భాగంలోని శివమొగ్గ, ఆగుంబే, తీర్థనహళ్లి, వరనాడు తదితర ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో డ్యాంకు ఇన్‌ఫ్లో ప్రారంభమైన సంగతి తెలిసిందే. సోమవారం ఇన్‌ఫ్లో 4,817 క్యూసెక్కులుగా నమోదైంది. అవుట్‌ఫ్లో 10 క్యూసెక్కులుగా ఉంది. డ్యాం సామర్థ్యం 105.788 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 4.581 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గతేడాది ఇదే సమయానికి 1,581.07 అడుగుల వద్ద 5.012 టీఎంసీల నీటి నిల్వతో 280 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉందని బోర్డు అధికారులు తెలిపారు.

కళ్ల ముందే చెదిరిన కలలు

- నీటి కుంటలో పడి భర్త, కుమారుడి మృతి
- తన ఎదుటే ఇద్దరి మృతితో తల్లడిల్లిన ఇల్లాలు

ఆత్మకూరు: ఎదిగొస్తున్న కుమారులను చూస్తూ ఆ ఇల్లాలు ఎంతో మురిసిపోయేది. రెక్కల కష్టంతో కుటుంబాన్ని పోషిస్తున్న భర్తతో పిల్లవాళ్లను బాగా చదివించాలంటూ రోజూ చెప్పేది. కానీ, ఆ మహిళ కలలను ఊహించని ప్రమాదం కల్లలు చేసింది. కంటి పాపని, ఇంటి పెద్దని 'మింగి' తీరని దుఃఖం మిగిల్చింది. దైవ దర్శనానికి వెళ్లి తిరిగి వెళ్తున్న క్రమంలో తండ్రి, కుమారుడు మరణించిన విషాద ఘటన మండలంలోని వడ్డుపల్లి సమీపంలో జరిగింది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటనపై పోలీసులు తెలిపిన మేరకు.. అనంతపురం నాల్గో రోడ్డుకు చెందిన రాజగోపాల్ (38), అపర్ణ దంపతులు. వీరికి ఇద్దరు కుమారులు సంతానం. వ్యాపారం చేసుకుంటూ రాజగోపాల్ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆదివారం ద్విచక్ర వాహనంపై ఆత్మకూరు మండలం పంపనూరులోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయానికి భార్య, చిన్న కుమారుడు వశిష్ట(8)తో కలిసి వచ్చారు.స్వామి దర్శనానంతరం సమీపంలోని సిటీ పార్కులో అందరూ ఆనందంగా గడిపారు. తిరుగు ప్రయాణంలో వడ్డుపల్లి వద్ద ఉన్న టోల్ గేట్ సమీపంలో ద్విచక్రవాహనాన్ని ఆపారు. ఈ క్రమంలోనే వశిష్ట అక్కడికి సమీపంలోని ఓ కుంట దగ్గరకు వెళ్లాడు. కాలు జారి నీటిలో పడిపోయాడు. పిల్లాడి అరుపులు విన్న రాజగోపాల్ వెంటనే నీటిలో దూకాడు. ఈత రాకపోవడంతో ఇద్దరూ నీటిలో మునిగిపోయారు. అటుగా వెళ్తున్న వాహనదారుల సాయంతో అపర్ణ తన భర్త, కుమారుడిని బయటకు తీయించారు. వెంటనే 108లో అనంతపురం సర్వజనాస్పత్రికి తీసుకురాగా, అప్పటికే ఇద్దరూ మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కళ్ల ముందే కొనఊపిరితో కొట్టుమిట్టాడిన వారిని చూసి అపర్ణ తీవ్రంగా రోదించింది. పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేసుకున్నారు.



ప్రమాదానికి కారణమైన నీటి కుంట





రాజగోపాల్, వశిష్ట మృతదేహాలు

క్లుప్తంగా

'నారాయణ'లో పుస్తకాల సీజ్



పుస్తకాలున్న గదిని సీజ్ చేస్తున్న అధికారులు (చిత్రంలో) విద్యార్థి సంఘం నాయకులు

కళ్యాణదుర్గం రూరల్: నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్లు చేపట్టడమే కాక అధిక ధరకు పాఠ్య పుస్తకాలు విక్రయిస్తున్న కళ్యాణదుర్గంలోని నారాయణ పాఠశాలను అధికారులు సీజ్ చేశారు. విద్యార్థి సంఘం ఫిర్యాదు మేరకు సోమవారం మండలం విద్యాధికారి విజయ కుమారి తనిఖీ చేపట్టారు. ప్రభుత్వ నిర్ణయించిన ధర కంటే ఎక్కువగా ఫీజులు వసూలు చేయాలని, పుస్తకాలను అధిక ధరకు విక్రయించరాదని ఈ సందర్భంగా విజయకుమారి తెలిపారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి హనుమంతరాయుడు, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు అచ్యుత్ ప్రసాద్, తాలూకా ఉపాధ్యక్షుడు నవీన్, పట్టణ కార్యదర్శి హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

బాలికపై కండక్టర్ అనుచిత ప్రవర్తన

- డయల్ 100ను ఆశ్రయించిన బాధితురాలు
- పోలీసుల అదుపులో కామాంధుడు

తాడిపత్రి: బస్సులో ప్రయాణిస్తున్న బాలికపై కండక్టర్ అనుచితంగా ప్రవర్తించాడు. దీంతో డయల్ 100కు బాధితురాలు ఫిర్యాదు చేయడంతో పోలీసులు వెంటనే స్పందించి కండక్టర్‌ను అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన మేరకు... పుట్లూరు మండలం శెనగల గూడూరు గ్రామానికి చెందిన ఓ బాలిక కొన్ని రోజుల క్రితం నంద్యాల జిల్లా ఉయ్యాలవాడలోని తన పెద్దమ్మ ఇంటికి వెళ్లింది. సోమవారం మధ్యాహ్నం స్వగ్రామానికి తిరుగు ప్రయాణమైన బాలిక ఉయ్యాలవాడలో ఆళ్లగడ్డ డిపోకు చెందిన బస్సు ఎక్కింది. బస్సు రద్దీగా ఉండడంతో తన పక్కన ఉన్న సీట్లో బాలికను కండక్టర్ కూర్చొబెట్టాడు. ఈ క్రమంలోనే మార్గం మధ్యంలో ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ వచ్చాడు. ఇదే విషయాన్ని తన తండ్రికి ఫోన్ చేసి బాలిక తెలిపింది. ఆయన సూచన మేరకు వెంటనే డయల్ 100కు కాల్ చేసి విషయాన్ని చేరవేసింది. దీంతో బస్సు తాడిపత్రి బస్టాండ్‌కు చేరుకోగానే అప్పటికే అక్కడకు చేరుకున్న రూరల్ పోలీసులు వెంటనే కండక్టర్‌ను అదుపులోకి తీసుకుని, పట్టణ పోలీసులకు అప్పగించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు.

29న జాతీయ లోక్ అదాలత్



ధర్మవరం అర్బన్: పట్టణంలోని కోర్టు సముదాయంలో ఈ నెల 29న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి గీతావాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ ఆదేశాల మేరకు నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో కక్షిదారులు, పోలీసులు, న్యాయవాదులు, బ్యాంకు రుణం పెండింగ్‌లో ఉన్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాజీకి అవకాశమున్న సివిల్, క్రిమినల్, ఎక్సైజ్ తదితర కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు.

అనంత భూముల్లో సేంద్రియ లోపం

- భూసార పరీక్షా ఫలితాల ఆధారంగా వెల్లడైన భూభౌతిక స్థితిగతులు
- పశువుల ఎరువు, పచ్చిరొట్ట పైర్ల సాగుతో భూసారం పెంపు
- నత్రజని వినియోగం పెరగాలి

జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ భూముల విస్తీర్ణం :

5.70 లక్షల హెక్టార్లు

ఎర్రనేలలు: **76** శాతం

నల్లరేగళ్లు : **22** శాతం

ఇసుక నేలలు : **2** శాతం



అనంతపురం అగ్రికల్చర్: జిల్లాలో ఉన్న భూముల్లో కీలకమైన సేంద్రియ కర్బనం (ఆర్గానిక్ కర్బన్) చాలా తక్కువగా ఉన్నట్లు వెల్లడైంది. వ్యవసాయం లాభసాటి కావాలంటే సేంద్రియ కర్బనం అత్యంత కీలకం. అయితే జిల్లాలోని భూముల్లో సేంద్రియ కర్బనం చాలా తక్కువ శాతం ఉన్నట్లు భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా స్పష్టంగా వెల్లడైంది. అధిక దిగుబడుల కోసం గత కొన్నేళ్లుగా విచ్చలవిడిగా రసాయనిక ఎరువులు, క్రిమి సంహారక మందులు వాడకం అధికం కావడంతో భూభౌతిక స్థితిగతులు దారుణంగా దెబ్బతిన్నాయని నిపుణులు చెబుతున్నారు. సేంద్రియ కర్బనం వినియోగం పెరిగితే తప్ప పంట దిగుబడులు కూడా పెరిగే అవకాశం లేదని, దీనికి తోడు రైతులకు పెట్టుబడుల ఖర్చులు తగ్గుతాయని అంటున్నారు.

5.70 లక్షల హెక్టార్లు సాగుభూమి

జిల్లాలో 10,205 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించిన 31 మండలాల్లో 5.70 లక్షల హెక్టార్ల వ్యవసాయ భూములు ఉన్నట్లు అధికారిక రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. ఇందులో 76 శాతం అంటే 4.33 లక్షల హెక్టార్ల మేర మధ్యస్థ ఎర్రగరప నేలలు ఉండగా, 22 శాతం అంటే 1.25 లక్షల హెక్టార్లు బరువైన నల్లరేగడి భూములు ఉన్నాయి. మిగిలిన 2 శాతం అంటే 12 వేల హెక్టార్ల మేర తేలికపాటి ఇసుకనేలలు ఉన్నాయి. జిల్లాలో 4,03,454 మంది రైతులు ఉన్నారు. ఇందులో ఒక హెక్టారు లోపు భూములున్న చిన్నకారు రైతులు 1,27,584 మంది ఉండగా ఒకటి నుంచి 2 హెక్టార్ల లోపు ఉన్న సన్నకారు రైతులు 1,47,044 మంది ఉన్నారు. ఇక రెండు నుంచి నాలుగు హెక్టార్ల లోపు ఉన్న మధ్యస్థ రైతులు 1,03,793 మంది ఉండగా 4 నుంచి 10 హెక్టార్ల వరకు ఉన్న ఓ మాదిరి రైతులు 22,952 మంది, 10 హెక్టార్లు, అంతకన్నా ఎక్కువ కలిగిన పెద్ద రైతులు కేవలం 2,081 మంది ఉన్నట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

87 శాతం సేంద్రియ కర్బనం లోపం

స్థిరంగా పంట దిగుబడుల రావాలంటే భూమిలో నత్రజని-భాస్వరం-పొటాష్ (ఎన్-పీ-కే) పోషకాలు ప్రధానపాత్ర పోషిస్తాయి. సూక్ష్మ (మైక్రో), స్థూల (మ్యాక్రో) పోషకాలు (న్యూటియంట్స్) సమపాళ్లలో ఉన్నపుడే బెట్ట ఏర్పడినా అంతోఇంతో పంట దిగుబడులు చేతికి వస్తాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అయితే 5.70 లక్షల హెక్టార్ల వ్యవసాయ భూములు కలిగిన అనంతపురం జిల్లాలో 87 శాతం భూములు అంటే 4.95 లక్షల హెక్టార్లలో అత్యంత కీలకమైన సేంద్రియ కర్బనం పోషక లోపం ఉన్నట్లు బహిర్గతమైంది. అలాగే నత్రజని-భాస్వరం-పొటాష్ (ఎన్-పీ-కే) పోషక స్థితిగతుల విషయానికి వస్తే... భూముల్లో సాధారణం కన్నా 85 శాతం నత్రజని (ఎన్) లోపం ఉన్నట్లు గుర్తించారు. ఇదే సందర్భంలో మన నేలల్లో 78 శాతం భాస్వరం (ఫాస్పరస్), అలాగే 85 శాతం పొటాష్ (కే) అధికంగా ఉండడం విశేషం. అంటే మొత్తమ్మీద కీలకమైన సేంద్రియ కర్బనం, నత్రజని పోషకాలు చాలా తక్కువగానూ, భాస్వరం, పొటాష్ శాతం అధికంగా ఉన్నాయి. అలాగే సల్ఫర్ (గంధకం) కూడా 95 శాతం అధికంగా ఉన్నట్లు గుర్తించారు. ఇక మైక్రోన్యూట్రియంట్స్ (సూక్ష్మపోషకాలు) విషయానికి వస్తే... 26 శాతం జింక్‌సల్ఫేట్, 11 శాతం ఇనుము, 2.20 శాతం రాగి, 1.80 శాతం మాంగనీసు, 18 శాతం బోరాన్ లోపం ఉన్నట్లు స్పష్టమైంది. అంటే ఇవన్నీ మరీ ఎక్కువ మరీ తక్కువ లేకుండా మధ్యస్థంగా ఉన్నట్లు చెబుతున్నారు.

మట్టి పరీక్షలతో సమతుల పోషకాలు



భూసార పరీక్షలు, వాటి ఫలితాల ఆధారంగా పోషకాలను సమతులం చేసుకుంటే తప్ప భూభౌతిక లక్షణాలు మెరుగుపడే అవకాశం లేదు. పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్ల, పందుల ఎరువు లాంటి సేంద్రియ పోషకాల వాడకం పెరగాలి. వానపాముల ఎరువు, చెరువు మట్టి తోలడం, అలాగే జనుము, జీలుగు, పిల్లిపెసర లాంటి పచ్చిరొట్ట విత్తనాలు (గ్రీన్‌మెన్యూర్స్) ద్వారా భూసారం పెంచుకోవాలి. వానపాములు, పంటలకు మేలు చేసే సూక్ష్మజీవులు అభివృద్ధి చెందాలి. భూమిలో ఉన్న గట్టిపొరను పెకలించి గుల్లబారేలా దుక్కి చేసుకోవడం ద్వారా వేసిన ఎరువులు, పోషకాలు స్థిరీకరణతో వ్యవసాయం లాభసాటిగా మారుతుంది. రసాయనిక ఎరువుల వాడకం బాగా తగ్గించాలి.

– ఎల్.రోజాపుష్పలత, ఏడీఏ, భూసార పరీక్షా కేంద్రం

దోపిడీ దొంగల బీభత్సం



బాధితురాలు సరోజమ్మతో మాట్లాడుతున్న డీఎస్పీ జనార్దననాయుడు

తాడిపత్రి: పట్టణంలో పట్టపగలే దోపిడీ దొంగలు రెచ్చిపోయారు. ఇంట్లోకి చొరబడి గృహిణిపై బ్లేడుతో దాడి చేసి విలువైన బంగారు నగలు అపహరించుకెళ్లారు. బాధితురాలు తెలిపిన మేరకు.. తాడిపత్రిలోని కేవీరెడ్డి నగర్‌లో నివాసముంటున్న ఓ ప్రైవేట్ స్కూల్ కరస్పాండెంట్ దస్తగిరి భార్య సరోజమ్మ సోమవారం ఉదయం 11 గంటల సమయంలో ఇంట్లో ఒక్కతే ఉంది. విషయాన్ని పసిగట్టిన ఇద్దరు ఆగంతకులు వరండాలోకి చేరుకుని అన్నా... అన్నా అంటూ పిలిచారు. దీంతో వారి వద్దకు సరోజమ్మ వెళ్లి ఎవరని ప్రశ్నిస్తుండగా ఆమెను బలంతంగా ఇంట్లోకి నెట్టి లోపలకు చొరబడ్డారు. అనంతరం తమ వద్ద ఉన్న బ్లేడుతో ఆమె చేతులు కోశారు. గట్టిగా కేకలు పెడితే హతమారుస్తామంటూ బెదిరిస్తూ తలను నేలకేసి బాదారు. అనంతరం ఆమె శరీరంపై ఉన్న 4 తులాల బంగారు గొలుసు, 2 తులాల పూసల చైన్, 6 తులాల బరువున్న ఆరు బంగారు గాజులు లాక్కొని ఉడాయించారు. దాడి నుంచి తేరుకున్న అనంతరం సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని బాధితురాలిని ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ జనార్దననాయుడు ఘటనా స్థలానికి చేరుకుని బాధిత కుటుంబసభ్యులతో మాట్లాడారు. దోపిడీ జరిగిన తీరుపై ఆరా తీశారు. అనంతరం ప్రభుత్వాస్పత్రికి చేరుకుని బాధితురాలి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

గుత్తి డిపోలో కాంట్రాక్టర్ అక్రమాలు

- అడ్డదారిలో రూ.1.9 లక్షలు దోపిడీ
- పీఓ దర్యాప్తులో వెలుగు చూసిన వైనం
- తప్పిదాలకు తావే లేదని బుకాయించిన ఆర్ఎం
- ఇప్పటికీ చర్యలకు ఉపక్రమించని అధికారులు
- నివేదికను ప్రధాన కార్యాలయానికి పంపిన విజిలెన్స్

అనంతపురం క్రైం: ఆర్టీసీలో కాంట్రాక్టర్లు ఖతర్నాక్‌లని తేలిపోయింది. పలు విభాగాల్లో కార్మికులు, టెక్నీషియన్లను ఏర్పాటు చేయడానికి టెండర్ల ద్వారా కాంట్రాక్ట్ దక్కించుకున్న మ్యాన్ పవర్ సొసైటీల్లో డొల్లతనం బయటపడింది. అధికారులకు మాముళ్ల ఎర వేసి అడ్డదారుల్లో దొరికినంత దోచుకున్న వైనం బట్టబయలైంది. ఇదే విషయాన్ని గత నెల 27న 'ఖతర్నాక్ కాంట్రాక్టర్లు' శీర్షికన 'సాక్షి'లో కథనం వెలువడింది. ఈ విషయంపై స్పందించిన జిల్లా ప్రజారవాణాధికారి సుమంత్.ఆర్.ఆదోని.... ఆర్టీసీలో ఎలాంటి తప్పిదాలకు తావులేదని అప్పట్లో బుకాయించడం గమనార్హం.

విచారణలో ఒక్కొక్కటిగా వెలుగులోకి

ఖతర్నాక్ కాంట్రాక్టర్ల దోపిడీపై పర్సనల్ ఆఫీసర్ విచారణ చేపట్టారు. దీంతో ఒక్కొక్కటిగా అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి. గుత్తి డిపోలో సోషల్ వెల్ఫేర్ సొసైటీ పేరుతో కాంట్రాక్ట్ చేజిక్కించుకున్న కాంట్రాక్టర్ రూ.1.9 లక్షలు అక్రమ మార్గంలో దోచుకున్నట్లు బహిర్గతమైంది. జిల్లా వ్యాప్తంగా కాంట్రాక్టర్లు సంస్థకు ఇవ్వాల్సిన మ్యాన్ పవర్‌ను అందించకుండా రికార్డుల్లో మాత్రం లెక్కలు చక్కగా చూపుతున్నట్లుగా విచారణాధికారి గుర్తించారు. ఈ అక్రమాల వెనుక అధికారుల హస్తమున్నట్లు తేలింది. ఒక్క గుత్తి డిపోలోనే ఇంత పెద్ద ఎత్తున అక్రమాలు వెలుగు చూశాయంటే జిల్లా వ్యాప్తంగా మరెన్ని ఉంటాయో ఊహించుకోవచ్చు. ఆర్టీసీ బస్సులు చెల్లించాల్సిన టోల్ చార్జీల వ్యవహారంలోనూ రూ.వేలు అధికారులు సొంత ఖజానాకు మళ్లించుకున్నట్లుగా తెలుస్తోంది.

నిర్లక్ష్యమే ఆదాయానికి గండి

ఆర్టీసీ సంస్థను నష్టాల ఊబిలోంచి లాభాల బాట పట్టించేందుకు దోహద పడాల్సిన అధికారులు ఆ ఊసే మరిచారు. స్వీయ ఆదాయ మార్గాలను అన్వేషించడంలోనే కాలాన్ని గడుపుతున్నారు. ఫలితంగా ఆర్టీసీ పురోగతి అగమ్యగోచరంగా మారింది. కండీషన్ లేని బస్సులు, అసౌకర్యాల బస్టాండ్లలో ప్రయాణికులు సతమతమవుతున్నారు. రోజుకు లక్షలాది రూపాయలు ఆదాయం తెచ్చే కార్గోలాంటి సేవల్లోనూ చాలా లోపాలున్నట్లుగా తెలుస్తోంది. కార్గో సేవల ద్వారా వచ్చే ఆదాయం కంటే వినియోగదారుల ఫిర్యాదులే ఎక్కువగా ఉండడంతో అధికారులు తలలు బాదుకుంటున్నట్లు సమాచారం. బస్టాండుల్లో దుకాణాల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. ఇష్టారాజ్యంగా ధరలు పెంచి సరుకు విక్రయాలు సాగిస్తున్నా.. అధికారులు స్పందించడం లేదు. దీంతో ప్రయాణికులు ఏది కొనాలన్నా బస్టాండ్ బయటకు పరుగు తీయాల్సి వస్తోంది.

ప్రజాస్వామ్య బద్ధంగా రాజకీయాలు చేశాం

- పారిపోవాల్సిన అవసరం మాకు లేదు
- నియోజకవర్గ ప్రజలకు 'తోపుదుర్తి' కుటుంబం అండగా ఉంటుంది
- ప్రజలకు చంద్రబాబు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాలి
- లేదంటే ప్రజల పక్షాన ప్రభుత్వంపై పోరాడతాం
- వైఎస్సార్‌సీపీ రాప్తాడు నియోజకవర్గ సీనియర్ నాయకుడు తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి



రాప్తాడు రూరల్: 'గడిచిన ఐదేళ్లు రాప్తాడు నియోజకవర్గంలో ప్రజాస్వామ్యబద్ధంగా రాజకీయాలు చేశాం. తోపుదుర్తి కుటుంబం ఎప్పుడూ నియోజకవర్గ ప్రజలకు అండగా ఉంటుంది' అని రాప్తాడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. టీడీపీ అధికారంలోకి రాగానే తోపుదుర్తి సోదరులు పారిపోయారంటూ ఎల్లో మీడియా ప్రచారం చేస్తుండడాన్ని తప్పుబట్టారు. కథనాలను ఖండించారు. తోపుదుర్తి కుటుంబం ఎప్పుడూ ప్రజల పక్షాన నిలబడుతుందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుకు గెలిచిన తర్వాత పరిటాల కుటుంబం దృష్టి సారించకుండా గ్రామాల్లో ఫ్యాక్షన్‌ను రెచ్చగొట్టేలా అనుకూల మీడియాలో కథనాలు ప్రచురితం చేయిస్తోందని మండిపడ్డారు. టీడీపీకి వ్యతిరేకంగా ఉన్నామనే కక్షతో దాదాపు 30 ఏళ్లుగా తమ కుటుంబాన్ని ప్రజల్లో విలన్లుగా చిత్రీకరించే ప్రయత్నాలు సాగుతున్నాయన్నారు. ప్రజలను, ప్రజాస్వామ్యవాదులను భయభ్రాంతులకు గురి చేయాలనుకోవడం అవివేకం అన్నారు. ఈ ప్రాంతంలో ఫ్యాక్షన్‌ను రూపుమాపేందుకు తోపుదుర్తి కుటుంబం నిరంతరం పని చేసిందన్నారు. కేవలం పరిటాల సునీతను గెలిపించేందుకు తమ కుటుంబాన్ని విలన్లుగా చిత్రీకరిస్తూ 500 కథనాలు ఎల్లో పత్రికల్లో ప్రచురితమైతే... మరో 150 ఎపిసోడ్లు ఎల్లో మీడియాలో ప్రసారమయ్యాయని గుర్తు చేశారు. ఇప్పటికే ఎల్లో మీడియా తమ కుటుంబంపై దుష్ప్రచారం కొనసాగిస్తోందన్నారు. ఈవీఎంలను ట్యాంపరింగ్ చేయడం ద్వారా గెలిచారనే అనుమానాలు రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల్లో నెలకొన్నాయన్నారు. ఏది ఏమైనా ప్రజా తీర్పునకు తాము కట్టుబడి ఉన్నామని, తమ కార్యకర్తలకు అండగా ఉంటామని, ప్రజల పక్షాన పోరాటాలు చేస్తామని తోపుదుర్తి చందు స్పష్టం చేశారు.

'నీట్' ఫలితాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వి. జాన్సన్ బాబు డిమాండ్



మాట్లాడుతున్న జాన్సన్‌బాబు

అనంతపురం ఎడ్యుకేషన్: నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (నీట్) ఇటీవల విడుదల చేసిన ఫలితాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వి.జాన్సన్‌బాబు డిమాండ్ చేశారు. దేశ వ్యాప్తంగా 67 మంది విద్యార్థులకు 720 మార్కులకు 720 మార్కులు రావడం, అందులో ఆరుగురు విద్యార్థులు హర్యానాలోని ఒకే సెంటర్‌కు చెందిన వారు కావడంపై అనుమానాలను ఆయన వ్యక్తం చేశారు. అనంతపురంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వేలాదిమంది ప్రతిభగల విద్యార్థులు వైద్య విద్యకు దూరం కాకుండా ఉండాలంటే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విడుదల చేసిన ఫలితాలపై కేంద్ర ప్రభుత్వం స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నిబంధనలు తుంగలో తొక్కి ముందస్తు అడ్మిషన్లు చేస్తూ అనుమతులు లేకుండా నడుపుతున్న విద్యాసంస్థలపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రమణయ్య, కుళ్లాయిస్వామి, జిల్లా ఉపాధ్యక్షుడు వంశీ, నగర అధ్యక్ష కార్యదర్శులు మంజునాథ్, ఉమామహేష్, నగర నాయకులు హరికృష్ణ, రారాజు, పవన్, హర్ష, సమీర్, శేఖర్, వరుణ్, తరుణ్, అరుణ్ పాల్గొన్నారు.

అంతర్జాతీయ చెస్ టోర్నీ విజేతగా 'పురం' వాసి



ట్రోఫీ అందుకుంటున్న క్రీడాకారుడు అఫ్రిద్ ఖాన్

హిందూపురం టౌన్: పశ్చిమ గోదావరి జిల్లా కేంద్రం భీమవరం వేదికగా ఈ నెల 4 నుంచి 9వ తేదీ వరకూ జరిగిన అంతర్జాతీయ ఓపెన్ చెస్ టోర్నీ విజేతగా హిందూపురానికి చెందిన క్రీడాకారుడు అఫ్రిద్ ఖాన్ నిలిచాడు. ఈ మేరకు కోచ్ ఆరీఫ్ వుల్లా సోమవారం తెలిపారు. అంతర్జాతీయ ఓపెన్ చెస్ పోటీలకు 270 మంది జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులు హాజరు కాగా, 10 మ్యాచ్‌ల్లో ఆరు మ్యాచ్‌లను అఫ్రిద్ ఖాన్ గెలిచాడని, మరో నాలుగు మ్యాచ్‌లో డ్రా అయ్యాయని వివరించారు. టోర్నీ విజేతగా నిలిచిన అఫ్రిద్ ఖాన్‌ను అభినందిస్తూ ట్రోఫీతో పాటు రూ.60వేల నగదు పురస్కారాన్ని అందజేశారన్నారు.

'నీట్' అక్రమాలపై తక్షణమే చర్యలు చేపట్టాలి

- ఏఐఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు వేమన డిమాండ్

అనంతపురం ఎడ్యుకేషన్: 'నీట్' ఫలితాల్లో చోటు చేసుకున్న అక్రమాలపై వెంటనే విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఏ (ఐసా) నాయకులు డిమాండ్ చేశారు. ఏఐఎస్ఏ జాతీయ కమిటీ పిలుపు మేరకు సోమవారం అనంతపురంలోని గాంధీ విగ్రహం ఎదుట నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు వేమన మాట్లాడుతూ... ఈ నెల 4న నీట్ 2024 ఫలితాలు వెలువడ్డాయన్నారు. ఈ నెల 14న ఇవ్వాల్సిన ఫలితాలను నిర్ణీత సమయానికి ముందే ప్రకటించారన్నారు. 23 లక్షల మంది విద్యార్థులు నీట్ పరీక్షకు హాజరయ్యారన్నారు. నీట్ పేపర్ లీక్ వార్త, ఫలితాల్లో అవకతవకల కారణంగా దేశంలోని లక్షలాది మంది యువత భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. పేపర్ లీకేజీని ఎన్‌టీఏ కొట్టిపారేయడాన్ని ఖండించారు. నీట్ పేపర్ లీకేజీకి సంబంధించి బీహార్‌లో 13 మందిని అరెస్ట్ చేశారన్నారు. ఏటా ఇద్దరు, ముగ్గురు, నలుగురు మాత్రమే టాప్ విద్యార్థులు ఉండేవారన్నారు. కానీ ఈసారి 720కి 720 మార్కులు సాధించి 67 మంది విద్యార్థులుటాప్ లిస్ట్‌లో ఉండడం, కటాఫ్ ఎక్కువగా ఉండడంతో ఏడాదంతా గంటల తరబడి చదువుకుని రూ.లక్షల్లో ఫీజులు చెల్లించిన విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలో కూరుకుపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఒకే ఇన్‌స్టిట్యూట్‌లోని చాలా మంది విద్యార్థులు టాపర్‌లుగా నిలవడంపై అనుమానాలు వ్యక్తం చేశారు. నీట్ ఫలితాలపై వస్తున్న ఆరోపణల్లో నిగ్గు తేల్చేందుకు పారదర్శకంగా దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఏ జిల్లా నాయకులు బాలకృష్ణ, రాజు నాయక్, సద్దాం, ఉదయ్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న విధ్వంసం

జిల్లా వ్యాప్తంగా టీడీపీ నేతల విధ్వంసం కొనసాగుతూనే ఉంది. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలిచిన సచివాలయాలపై దాడులు నానాటికీ పెరిగిపోతున్నాయి. ఈ క్రమంలో వారి దుశ్చర్యలను ప్రశ్నించిన వారిపై బెదిరింపులూ ఎక్కువయ్యాయి.

అనంతపురం: నగరంలోని పలు వార్డు సచివాలయాలపై సోమవారం టీడీపీ కార్యకర్తలు దాడులు చేశారు. నాయక్‌నగర్‌లోని 47, 48 వార్డు సచివాలయాలు, అరవింద నగర్‌లోని 49వ వార్డు సచివాలయాల శిలాఫలకాలు ధ్వంసం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించిన కరపత్రాలను దగ్ధం చేశారు. కొత్త ప్రభుత్వం కరపత్రాలు పంచాలని నినాదాలు చేశారు. కరపత్రాలు దహనం చేయడంతో పొగ రావడం చూసిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. దీంతో అనంతపురం టూ టౌన్ సీఐ క్రాంతి కుమార్ అక్కడికి చేరుకుని ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. వార్డు సచివాలయాల వద్ద పోలీసు బందోబస్తును కట్టుదిట్టం చేశారు.



మలయనూరు సచివాలయం శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన దృశ్యం

కుందుర్పి: మండలంలోని మలయనూరు గ్రామ సచివాలయ భవన శిలాఫలకాన్ని సోమవారం టీడీపీ కార్యకర్తలు ధ్వంసం చేశారు. సుత్తితో శిలాఫలకాన్ని పగులగొట్టారు. కొలిమిపాళ్యంలోని రైతు భరోసా కేంద్రం బోర్డునూ ధ్వంసం చేశారు. మండల వ్యాప్తంగా ప్రభుత్వ భవనాలకు సంబంధించిన ఆస్తులను ధ్వంసం చేస్తున్నా పోలీసులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు.

రక్షణ కల్పించండి : తన కుటుంబానికి టీడీపీ కార్యకర్తల నుంచి ప్రాణ హాని ఉందని, వెంటనే రక్షణ కల్పించాలని మలయనూరు ఆంజనేయస్వామి అర్చకుడు లక్ష్మీకాంత్, ఆయన భార్య చందన కళ్యాణదుర్గం రూరల్ సీఐ నాగరాజుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. శనివారం రాత్రి తాను లేని సమయంలో మలయనూరులోని తన ఇంటిపై టీడీపీ కార్యకర్తలు నరసింహ, సంజీవ్‌కుమార్ దాడి చేసి వస్తువులు ధ్వంసం చేశారన్నారు. దుర్భాషలాడుతూ తన భార్య, కుమార్తెపై దాడి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను అర్చక వృత్తిని వదులుకుని ఆలయ తాళాలు సైతం సంజీవ్‌కుమార్‌కు అందజేసినా తనపై కక్ష గట్టి దాడులకు దిగుతున్నారని, తమ కుటుంబానికి రక్షణ కల్పించాలని పోలీసులను కోరారు.

ముగ్గురు టీడీపీ కార్యకర్తలపై రౌడీషీట్

అనంతపురం: అధికారం అండ చూసుకుని రెచ్చిపోయిన ముగ్గురు టీడీపీ కార్యకర్తలపై పోలీసులు రౌడీషీట్ తెరిచారు. వివరాలు... అనంతపురంలోని 49 వార్డు సచివాలయం శిలాఫలకాన్ని సోమవారం పలువురు టీడీపీ కార్యకర్తలు ధ్వంసం చేశారు. అనంతరం సచివాలయంలోకి వెళ్లి ప్రభుత్వ కరపత్రాలను దగ్ధం చేస్తూ ఉద్యోగులపై విరుచుకుపడ్డారు. అందరూ అక్కడి నుంచి వెళ్లిపోవాలని, సచివాలయానికి తాళం వేస్తున్నామని, తమ ప్రభుత్వం వచ్చింది కాబట్టి తమ వాళ్లే అక్కడ ఉద్యోగం చేస్తారంటూ హుకుం జారీ చేస్తూ ఉద్యోగులను భయభ్రాంతులకు గురిచేశారు. అయితే స్థానికుల నుంచి అప్పటికే సమాచారం అందుకుని అక్కడకు చేరుకున్న నగర టూ టౌన్ సీఐ క్రాంతికుమార్ అక్కడే ఉన్న టీడీపీ కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు. ఉన్నతాధికారుల సూచన మేరకు వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేయడంతో పాటు సాకే జయప్ప, సాకే రవితేజ, శ్రీకాంత్‌పై రౌడీ షీట్ నమోదు చేశారు. కాగా, ఘటనలో పాల్గొన్న అందరిపై రౌడీషీట్ తెరవాలని పోలీసు ఉన్నతాధికారులు నిర్ణయించారు. టీడీపీ శ్రేణుల అరాచకాలకు చెక్ పెట్టేందుకు పోలీసులు తీసుకున్న చర్యలపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.



అనంతపురంలోని వార్డు సచివాలయంలో ధ్వంసం చేసిన ప్రభుత్వ పథకాల సమాచార బోర్డు



ధ్వంసం చేసిన వార్డు సచివాలయ శిలాఫలకం

కట్టేస్తున్నా పట్టించుకోరా?

- యథేచ్ఛగా అనధికార నిర్మాణాలు
- నిబంధనలకు పాతర
- పట్టించుకోని టౌన్‌ప్లానింగ్ అధికారులు
- నగరపాలక సంస్థ ఆదాయానికి గండి



ఈ ఫోటోను చూడండి. నగరంలోని టవర్ క్లాక్ పోస్టాఫీస్ ప్రవేశ మార్గంలో ఏర్పాటు చేస్తున్న భారీ వ్యాపార సముదాయం. ఈ స్థాయిలో ఇనుప కంచెలతో నిర్మాణం చేపడుతున్నా.. నగరపాలక సంస్థ అధికారులు చివరి క్షణంలో ప్రత్యక్ష మయ్యారు. నోటీసులు ఆలస్యంగా జారీ చేశారు. టౌన్ ప్లానింగ్ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడంతోనే ఇటువంటి పరిస్థితి నెలకొంది.

అనంతపురం కార్పొరేషన్: నగరంలో యథేచ్ఛగా అనధికారంగా భవన నిర్మాణాలు జరుగుతున్నాయి. ధనార్జనే ధ్యేయంగా నగరంలో కొందరు వ్యాపారులు షార్ట్‌కట్‌లో షెడ్ల నిర్మాణానికి తెరలేపారు. భారీగా షెడ్లు ఏర్పాటు చేసుకుని అందులో రూ.లక్షల వ్యాపారాలు చేస్తున్నారు. ఇటువంటి నిర్మాణాలు చేపడుతూ నగరపాలక సంస్థ ఆదాయానికి భారీగా గండికొడుతున్నారు. ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాల్సిన పట్టణ ప్రణాళిక కార్యదర్శులు ప్రేక్షకపాత్ర చూస్తుండటం గమనార్హం. నిర్మాణం ప్రారంభంలోనే సదరు యజమానికి రెండు, మూడు నోటీసులు జారీ చేసి వాటిని తొలగించేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది. కానీ నగరంలో అటువంటి పరిస్థితి కనిపించడం లేదు.

అనధికార నిర్మాణాలకు అడ్డేది?

▸▸ నగరంలో సుభాష్ రోడ్డులో క్రాస్ సర్కిల్‌కు వెళ్లే మార్గంలోని కార్నర్ భవనం కూడా ఎటువంటి సెట్ బ్యాక్స్ వదలకుండా నిర్మాణం చేపట్టారు.

▸▸ సుభాష్ రోడ్డులోని ట్రెండ్స్ పక్కన నూతనంగా నిర్మిస్తున్న రెండు భవనాలు సెట్ బ్యాక్స్ వదలేదు. ప్రాథమిక నిబంధనలను పాటించకపోయినా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇలా నగరంలో అనేక ప్రాంతాల్లో ఇష్టానుసారంగా నిర్మాణాలు చేపడుతున్నా..టౌన్ ప్లానింగ్ అధికారులు చేష్టలుడిగి చూస్తున్నారు. వాస్తవంగా భవన నిర్మాణానికి ఏ విధంగా ఫీజులు చెల్లిస్తారో అదే విధంగా ఎటువంటి నిర్మాణం చేపట్టినా ఫీజులు చెల్లించాల్సి ఉంటుంది. కేవలం వేకెంట్ ల్యాండ్ ట్యాక్స్ తీసుకుని నిర్మాణాలు చేపడుతున్నారు.

కమిషనర్ దృష్టి సారిస్తేనే?

నగరంలో అనధికార నిర్మాణాలు, అతిక్రమణపై కమిషనర్ మేఘ స్వరూప్ ప్రత్యేక దృష్టిసారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అనుమతులు లేకుండా షెడ్లు, భారీ భవనాల అతిక్రమణలు జరుగుతున్నా.. టౌన్ ప్లానింగ్ ఏసీపీ మారుతీ ప్రసాద్, టీపీఓ శిరీష, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ దుర్గాంజలి పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కేవలం నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకుంటున్నారు. వీరు మురికివాడల్లో కాలువపై నిర్మించిన నిర్మాణాలు తొలగించాలంటే ఆగమేఘాలపై ఘటనా స్థలాలకు వెళ్తారు.. కానీ భారీ భవనాల వైపు కన్నెత్తి చూడరన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా కమిషనర్ చర్యలు తీసుకుంటారో లేదో వేచి చూడాలి.

చర్యలు తీసుకుంటాం

నగరంలో అనధికారికంగా భారీగా షెడ్లు వేసిన మాట వాస్తవమే. అందులో రూ.లక్షల్లో వ్యాపారాలు చేస్తున్నారు. దీనిపై ఇప్పటికే భవనాల యజమానులను హెచ్చరించాం. కానీ వారిలో ఎటువంటి మార్పు రాలేదు. సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి అనధికార నిర్మాణాలను కూల్చేందుకు చర్యలు తీసుకుంటాం.

– మారుతీప్రసాద్
(ఏసీపీ, నగరపాలక సంస్థ)

పూడికతీత పనులు వేగవంతం చేయాలి



పూడికతీత పనులను పరిశీలిస్తున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: నగరంలో వంకలు, డ్రైనేజీల్లో పూడికతీత పనులు వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని మేయర్ వసీం ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం నగరంలోని కృష్ణ ఎన్‌క్లేవ్ వద్ద ఉన్న మరువవంకలో జరుగుతున్న పూడికతీత పనులను డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్యలతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. వర్షపు నీరు ఆటంకం లేకుండా ప్రవహించేందుకు మరువవంక, నడిమి వంకతో పాటు డ్రైనేజీల్లో ఎప్పటికప్పుడు పూడికను తొలగించాలని సూచించారు. హిటాచీ, జేసీబీలను అదనంగా ఏర్పాటు చేసి వంకలు, కాలువల్లో చెత్త, పూడికతీత పనులు పూర్తి స్థాయిలో చేపట్టాలన్నారు. కాలువలపై ఆక్రమణలు లేకుండా చూసుకోవాలని తెలిపారు. సీజనల్ వ్యాధుల నివారణకు డ్రైనేజీల శుభ్రత ఎంతో దోహదపడుతుందన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా రోజూ ఫాగింగ్ చేయించాలని సూచించారు. అదేవిధంగా పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. పారిశుధ్య కార్యదర్శులు తమ సచివాలయ పరిధిలో పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వర్షాలతో తాగునీరు కలుషితం కాకుండా ఎప్పటికప్పుడు నీటి పరీక్షలు నిర్వహించాలన్నారు. వర్షాకాలం కావడంతో కాచి చల్లార్చిన నీటినే తాగాలన్నారు. పరిసరాల శుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు అబూసలేహ, అనిల్ కుమార్ రెడ్డి, కమల్ భూషణ్, సైఫుల్లా బేగ్ నాయకులు సాకే కుళ్లాయ స్వామి, మధు, కాకర్ల శీన, తదితరులు పాల్గొన్నారు.

ముళ్ల పొదలు, పిచ్చి మొక్కలు తొలగించండి



మాట్లాడుతున్న కమిషనర్ మేఘ స్వరూప్

అనంతపురం కార్పొరేషన్: రుద్రంపేట, నగరంలోని సోమనాథ్ నగర్ మీదుగా వెళ్లే నడిమివంక బ్రిడ్జ్‌ను నగరపాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్ సోమవారం పరిశీలించారు. ఇటీవల కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ నడిమివంక, మరువవంకను పరిశీలించిన విషయం విదితమే. ముళ్ల పొదలు, పిచ్చి మొక్కలను తొలగించడంతో పాటు పూడికతీత పనులు చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ క్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్ నడిమివంకలో ప్రస్తుత పరిస్థితి? పూడిక ఏ స్థాయిలో ఉందని ఆరా తీశారు. ఇందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఇరిగేషన్, అధికారులతో చర్చించారు. నడిమివంక స్కెచ్‌తో పాటు, వంక ఎంత వరకు ఉందని, తదితర వివరాలతో సమగ్ర నివేదికను సిద్ధం చేయాలని ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాలతో తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆర్‌డీఓ జీ వెంకటేష్, నగరపాలక సంస్థ ఎస్ఈ రామమోహన్ రెడ్డి, ఈఈ సూర్యనారాయణ, ఏసీపీ మారుతీప్రసాద్, టీపీఓ శిరీష, తదితరులు పాల్గొన్నారు.

పంటల సాగులో మెలకువలు పాటించాలి

పెద్దపప్పూరు: మొక్కజొన్న, వేరుశనగ, పత్తి పంటల సాగులో మెలకువలు పాటిస్తే ఆశించిన దిగుబడి సాధించవచ్చని డీడీఏ మద్దిలేటి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతుభరోసా కేంద్రంలో ఆయన పరిసర గ్రామల రైతులతో సమావేశం నిర్వహించారు. ఆయా పంటల సాగులో ఆశించే తెగుళ్ల నివారణకు ఎలాంటి మందులు పిచికారీ చేయాలన్న విషయాన్ని రైతులకు వివరించారు. పంటల సాగులో ఎలాంటి సందేహాలున్నా అధికారులను అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ శైలజాకుమారి, ఏఓ ఆంజనేయులు, ఏఈఓ ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు: రైతులకు అందుబాటులో ఉంటూ సలహాలు అందించాలని వ్యవసాయ సిబ్బందికి ఆత్మ పీడీ మద్దిలేటి సూచించారు. సోమవారం ఆయన మండలకేంద్రంలోని రైతు భరోసా కేంద్రంలో ఖరీఫ్ సాగులో తీసుకోవాల్సిన మెలకువలపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది సకాలంలో వర్షాలు వచ్చాయని, రైతులు పొలాల్లో సేద్యపు పనులు పూర్తి చేసుకుని వర్షపు నీరు ఇంకేలా చూసుకోవాలన్నారు. వేరుశనగ, కంది, ఆముదం తదితర పంటల సాగు కోసం అధిక దిగుబడులు ఇచ్చే విత్తనాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. అనంతరం రైతు శిక్షణ కేంద్రం ఏడీఏ శైలజా రైతులకు పలు సూచనలు అందించారు. ఏఓ కాత్యాయని సిబ్బంది పాల్గొన్నారు.



లేబర్ వార్డు సమీపంలో చెట్ల కింద కూర్చున్న రోగుల సహాయకులు

పరుచుకున్న పచ్చదనం



ఆస్పత్రి ప్రవేశ మార్గంలో ఏపుగా పెరిగిన చెట్లు

ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో ఉన్న చెట్లతో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంది. ఆస్పత్రికి పచ్చటి తోరణంలా చెట్లు ఏపుగా పెరిగాయి. ఆస్పత్రి ఆవరణలోని లేబర్ వార్డు సమీపంలో, ఆస్పత్రి ప్రవేశమార్గం, ఆర్థో వార్డు వైపు, పీజీ హాస్టల్, చెస్ట్ వార్డు, మార్చురీకి వెళ్లే మార్గంలో ఉన్న చెట్లు రోగులు, వారి సహాయకులకు నీడనిస్తున్నాయి. లేబర్ వార్డు పక్కన వేసిన సిమెంటు బల్లలపై కూర్చుని రోగుల సహాయకులు సేద తీరుతున్నారు. ఆస్పత్రిలో ఇంకా మరి కొన్ని ప్రాంతాల్లో మొక్కలను పెంచాల్సిన అవసరం ఉంది. – అనంతపురం మెడికల్:

రన్నర్స్ జట్టుకు అభినందనలు



టీం సభ్యులకు కప్ అందజేస్తూ అభినందిస్తున్న డీఈఓ, ఏడీలు



బెస్ట్ బ్యాట్స్‌మెన్ వంశీని అభినందిస్తున్న డీఈఓ వరలక్ష్మి

అనంతపురం ఎడ్యుకేషన్: విద్యాశాఖ నాన్ టీచింగ్ ఉద్యోగుల జోనల్ స్థాయి క్రికెట్ టోర్నీలో రన్నర్స్‌గా నిలిచిన ఉమ్మడి అనంతపురం జిల్లా జట్టు సభ్యులను జిల్లా విద్యాశాఖ అధికారి బి.వరలక్ష్మి సోమవారం అభినందించారు. జోనల్‌స్థాయి క్రికెట్ టోర్నీ ఈనెల 8, 9 తేదీల్లో కర్నూలులో జరిగింది. కడపపై గెలిచిన అనంతపురం, చిత్తూరుపై గెలిచి కర్నూలు జట్లు ఫైనల్‌లో తలపడ్డాయి. ఫైనల్ మ్యాచ్‌లో కర్నూలు జట్టు విజేతగా నిలిచింది. రన్నర్స్‌గా నిలిచిన అనంతపురం జట్టు సభ్యులను డీఈఓతో పాటు అసిస్టెంట్ డైరెక్టర్లు కృష్ణయ్య, నాగరాజు, సూపరింటెండెంట్లు అభినందించారు. కాగా ఈ టోర్నీలో ఒక మ్యాచ్‌లో 97 పరుగులు, మరో మ్యాచ్‌లో 44 పరుగులు సాధించి నాటౌట్‌గా నిలిచిన డీఈఓ కార్యాలయ ఉద్యోగి వంశీ బెస్ట్ బ్యాట్స్‌మెన్ అవార్డుకు ఎంపికయ్యారు. వంశీకి కప్ అందజేసిన విద్యాశాఖ అధికారులు ప్రత్యేకంగా అభినందించారు.

మధ్యాహ్న భోజన కార్మికులకు కొనసాగించాలి



ఆర్ఐ నాగభూషణంకు వినతిపత్రం అందజేస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులు

ఆత్మకూరు: జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులను కొనసాగించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంఈఓ కార్యాలయాల వద్ద మధ్యాహ్న భోజన కార్మికులతో కలిసి అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజనం కార్మికులు, శానిటేషన్ వర్కర్లను నైట్ వాచ్‌మెన్‌లను తొలగిస్తారని ఆందోళన చెందుతున్నారన్నారు. అతి తక్కువ వేతనాలతో పిల్లలకు భోజనం వండిపెడుతున్న వాళ్లను తొలగిస్తే కొత్తగా వచ్చే వారు నాణ్యతగా వంట వండలేరని తెలిపారు. నెలకు రూ.1,000 జీతం నుంచి శానిటేషన్ వర్కర్లు పని చేస్తున్నారన్నారు. నైట్ వాచ్‌మెన్లకు సంబంధించి వేతనాలు పెండింగ్‌లో ఉన్నా విధులు నిర్వహిస్తున్నారని గుర్తు చేశారు. అందరినీ యథావిధిగా కొనసాగించి మెమో చార్జీలు పెంచాలని కోరారు. పాఠశాలల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు రమాదేవి, మండల కమిటీ అధ్యక్షురాలు జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఉచితంగా విత్తనాలు



విత్తనాలను పంపిణీ చేస్తున్న శాస్త్రవేత్తలు

గుత్తి రూరల్: మండలంలోని కరిడికొండ గ్రామంలో ఎస్సీ రైతులకు ఉచితంగా విత్తనాలను పంపిణీ చేశారు. సోమవారం గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో రేకులకుంట వ్యవసాయ పరిశోధన కేంద్రం, ఆచార్య ఎన్జీ రంగ విశ్వవిద్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో శాస్త్రవేత్తలు డాక్టర్ నటరాజ్, డాక్టర్ లక్ష్మణ్, డాక్టర్ మాధవీలత 40 మంది ఎస్సీ రైతులకు రెండు కిలోల కందులు, రెండు కిలోల సజ్జ విత్తనాలను అందజేశారు. అనంతరం శాస్త్రవేత్తలు మాట్లాడుతూ షెడ్యూల్ కులాల ఉప ప్రణాళిక పథకంలో భాగంగా ఎస్సీ రైతులకు ఉచితంగా విత్తనాలను అందిస్తున్నామన్నారు. రైతులు అధిక దిగుబడులు సాధించేందుకు శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. భవిష్యత్తులో పంటల సాగులో మెలకువలను కూడా రైతులకు వివరిస్తామన్నారు. శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు పాటించి విత్తన శుద్ధి చేసి పంటలను సాగు చేయాలన్నారు. కార్యక్రమంలో వీఏఏ అజేయుడు, రైతులు పాల్గొన్నారు.

జోరువాన.. కాలనీలు జలమయం



గుత్తిలో కురుస్తున్న వర్షం

గుత్తి: గుత్తిలో సోమవారం భారీ వర్షం కురిసింది. లోతట్టు కాలనీలు జలమయం అయ్యాయి. వాహన రాకపోకలకు కాస్త ఇబ్బందులు తలెత్తాయి. రోడ్లపై, ఇళ్ల ముందు వర్షం నీరు చేరింది. అయితే వారంలో మూడు సార్లు వర్షం కురవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వాతావరణం కూడా చల్లబడింది.

గార్లదిన్నె, పామిడిలో మోస్తరు వర్షం

గార్లదిన్నె: మండల కేంద్రం గార్లదిన్నెతో పాటు పలు గ్రామాల్లో ఆదివారం, సోమవారం రెండు రోజులు మోస్తరు వర్షం కురిసింది. ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు సకాలంలో కురుస్తుండడంతో ఆయా గ్రామాల్లో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమైయ్యారు. బీడు భూముల్లో పచ్చగడ్డి మొలవడంతో పాడి రైతులు, పశువుల పెంపకదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పామిడి: పామిడిలో సోమవారం మోస్తరు వర్షం కురిసింది. వర్షానికి లోతట్టు ప్రాంతాలైన మదీనా కాలనీ, మడిక్షల ఆంజనేయ స్వామి వీధి, సీఎస్ఐ చర్చి–నూతన ఈద్గా వీధి, గుత్తి బీసీసీరోడ్డు జలమయ్యాయి. డ్రైనేజీ కాలువలు పొంగిపొర్లాయి. రోడ్లపై గుంతలు వర్షపు నీటితో నిండడంతో రాకపోకలకు అవస్థలకు గురయ్యారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

క్లుప్తంగా

అక్క దేవతలకు పూజలు



అక్క దేవతలకు హారతి ఇస్తున్న అర్చకుడు

ఆత్మకూరు: మండల కేంద్రంలో కొలువుదీరిన అక్క దేవతల ఉత్సవాలు ఇటీవల ఘనంగా జరిగాయి. ఇందులో భాగంగా సోమవారం అక్క దేవతలకు నెల పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయంలో అక్క దేవతలకు ప్రత్యేకంగా పూలతో అలంకరించారు. అనంతరం విశేష పూజా కార్యక్రమాలు చేపట్టారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

వృద్ధాశ్రమానికి వీల్‌చైర్ వితరణ

అనంతపురం కల్చరల్: నగరంలోని బెరాకా వృద్ధాశ్రమానికి వీల్‌చైర్, వృద్ధులకు వాకింగ్ స్టిక్స్‌ను సోమవారం సాయిట్రస్టు ప్రతినిధులు అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్టు ప్రతినిధి విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. నగరానికి చెందిన శ్రీనగర్ కాలనీ వాసి రజనీకాంత్ వాళ్ల తల్లిదండ్రుల పేరు మీద ట్రస్టుకు వృద్ధులకు కావాల్సిన పరికరాలను అందించారని తెలిపారు. వీటిని వెంటనే వృద్ధాశ్రమానికి అందజేశామన్నారు. కార్యక్రమంలో వెంకటలక్ష్మి, రాఘవేంద్ర నాయక్ తదితరులు పాల్గొన్నారు.

జోరుగా పంట రుణాల రెన్యూవల్



కనగానపల్లి స్టేట్ బ్యాంకు వద్ద రుణాలు రెన్యూవల్ చేసుకునేందుకు వచ్చిన రైతులు

కనగానపల్లి: మండలంలోని పలు బ్యాంకుల్లో ఖరీఫ్ పంట రుణాల రెన్యూవల్స్ జోరుగా కొనసాగుతున్నాయి. మండల కేంద్రంలోని స్టేట్‌బ్యాంక్, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులతో పాటు మామిళ్లపల్లిలోని గ్రామీణ బ్యాంకులో సుమారు 16 వేల మంది రైతులు ఏటా ఖరీఫ్‌లో పంట రుణాలు తీసుకుంటారు. కనగానపల్లి స్టేట్ బ్యాంకు, గ్రామీణ బ్యాంకుల వద్ద రైతుల రద్దీ కొనసాగుతోంది. జూన్ నెలాఖరులో పంట రుణాలు చేసుకోవాలని బ్యాంకు అధికారులు చెబుతుండటంతో రైతులు బ్యాంకులు వద్దకు భారీగా తరలి వస్తున్నారు. పాత రుణాల రెన్యూవల్‌తో పాటు కొత్త రుణాలు పొందే రైతులు కూడా బ్యాంకుల వద్దకు వస్తున్నారు. రైతులు తమ భూముల వన్‌బీ, అడంగల్ కాపీలు తీసుకునేందుకు మీ–సేవా కేంద్రాలు, రెవెన్యూ కార్యాలయాల వద్ద బారులు తీరుతున్నారు.


చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్పించాలి



వడ్డుపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

ఆత్మకూరు: మండల వ్యాప్తంగా ఉన్న 3 నుంచి 6 సంవత్సరాల్లోపు చిన్నారులను తప్పకుండా అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లావణ్య సూచించారు. సోమవారం మండలంలోని వడ్డుపల్లి గ్రామంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. మానవహారం చేపట్టి, ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 3 సంవత్సరాలు పైబడిన పిల్లల్ని అంగన్‌వాడీ ప్రైమరీ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యతో పాటు రోజూ కోడి గుడ్డు, పాలు, భోజనం అందిస్తామని పేర్కొన్నారు. పిల్లలకు ఆటపాటలతో విద్యా బోధన చేస్తామన్నారు. పౌష్టికాహారంతో పిల్లల్లో మానసికంగా, శారీరక ఎదుగుదల ఉంటుందని తెలిపారు. అంగన్‌వాడీల ద్వారా అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కాశీ విశ్వేశ్వరుడికి ప్రత్యేక పూజలు



అలంకరణలో కాశీ విశ్వేశ్వరుడు

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని ముసలమ్మ కట్ట వద్ద వెలసిన అతి పురాతన దేవాలయం, దక్షిణ కాశీగా పేరుగాంచిన కాశీ విశ్వేశ్వర దేవాలయంలో మూలవిరాట్‌కు సోమవారం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే స్వామికి పంచామృతాభిషేకం, రుద్రాభిషేకం, కుంకుమ అర్చనలు చేశారు. భక్తుల చేత మహా శివుడికి రుద్రాభిషేకాలు నిర్వహించారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

గార్లదిన్నె: శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ మహమ్మద్ గౌస్ హెచ్చరించారు. సోమవారం మండలంలోని మర్తాడు, కల్లూరులో సిబ్బందితో కలసి ఎస్ఐ పర్యటించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గ్రామాల్లో అల్లర్లు, గొడవలు జరగకుండా పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశామన్నారు.అనవసరంగా అల్లర్లు, గొడలు చేస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. గ్రామాల్లో శాంతి కమిటీలు ఏర్పాటు చేసుకుని రాజీ మార్గం ద్వారా కేసులు పరిష్కారం చేసుకోవాలన్నారు. అలాగే సీఐ శ్రీధర్ గార్లదిన్నె పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసి, మండలంలో శాంతిభద్రతలపై ఆరా తీశారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు

కంబదూరు: మహిళలు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చేసేందుకు ఆర్డీటీ తోడ్పాటునందిస్తోందని ఆ సంస్థ మహిళా సాధికారిత డైరెక్టర్ విశాల ఫెర్రర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఆర్డీటీ మహిళా సంఘాల సభ్యులు ఏర్పాటు చేసుకున్న స్త్రీ శక్తి మహిళా కోఆపరేటివ్ బ్యాంక్‌ను ఆమె ప్రారంభించారు. అనంతరం విశాల ఫెర్రర్ మాట్లాడుతూ ఆర్డీటీ ఆధ్వర్యంలో నడుస్తున్న మహిళా సంఘాల సభ్యులు సొంతంగా బ్యాంకు ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. బ్యాంక్ ద్వారా ఆర్థిక లావాదేవీలను సక్రమంగా చేసుకుని, ప్రతి మహిళా లక్షాధికారి కావాలని సూచించారు. కార్యక్రమంలో రీజినల్ డైరెక్టర్ సుబ్బరావు, ఆర్‌వైడీటీ రామాంజనేయులు, ఏటీఎల్ నారాయణస్వామి, సీఓ భాగ్యనంద స్వామి, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఆగి ఉన్న కారును ఢీకొన్న కంటైనర్



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

పెనుకొండ రూరల్: ఆగి ఉన్న కారును కంటైనర్ ఢీకొన్న సంఘటన మండల పరిధిలోని దుద్దేబండ వద్ద సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు మేరకు ... దుద్దేబండ గ్రామంలోని పెద్దమ్మ గుడి ఎదురుగా మలుపు వద్ద ఆగి ఉన్న కారును కియా అనుబంధ పరిశ్రమలోకి వెళ్లే కంటైనర్ ఢీ కొంది. దీంతో కారు ముందు భాగం పాక్షికంగా దెబ్బతింది. వెంటనే అప్రమత్తమైన కంటైనర్ డ్రైవర్ వేగాన్ని నియంత్రించడంతో కారులో ఉన్న డ్రైవర్‌కి ప్రాణాపాయం తప్పింది.

ఐదేళ్లు నిండిన పిల్లలను బడిలో చేర్పిస్తాం

గార్లదిన్నె: ప్రభుత్వ పాఠశాలలు పునఃప్రారంభించే సమయానికి ఐదేళ్లు నిండిన పిల్లలందరినీ బడిలో చేర్పిస్తామని మండల విద్యాశాఖ అధికారి చంద్రనాయక్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐదేళ్లు నిండిన పిల్లల వివరాలు సేకరించామని, పాఠశాలలు ప్రారంభించగానే పిల్లలందరినీ బడిలో చేర్పిస్తామన్నారు.అలాగే ఆయా గ్రామాల్లో సీఆర్పీల ద్వారా విద్యార్థుల వివరాలు సేకరించామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని సూచించారు.

నూతన కోర్సులకు శ్రీకారం

గుంతకల్లు: స్థానిక శ్రీ శంకరనంద గిరి డిగ్రీ కళాశాలలో నూతన కోర్సులను ప్రవేశపెట్టినట్లు కరస్పాండెంట్ హరి తెలిపారు. సోమవారం బీబీఏ విభాగం ప్రత్యేక స్టాఫ్ రూమ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధి ధ్యేయంగా నూతన కోర్సులను అందుబాటులోకి తెచ్చామన్నారు. ఈ ఏడాది బీబీఏ, బీసీఏ కోర్సులను ప్రవేశ పెట్టామన్నారు. విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గోపాల్, ఏవో డాక్టర్ చంద్రశేఖర్, బీబీఏ విభాగం అధ్యాపకులు వరప్రసాద్, శ్రావణి, సుభాషిని తదితరులు పాల్గొన్నారు.

బుగ్గ సంగాలలో పూజలు

గుంతకల్లు: మండలంలోని బుగ్గ సంగాలలో ఉన్న బుగ్గ సంగమేశ్వర ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామునే సంగమేశ్వరుడు మూలవిరాట్‌కు అర్చకులు అభిషేకం నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.